అక్కన్నపేటకు పారిశ్రామిక పార్కు

- స్థలాన్ని పరిశీలించిన ఆర్డీఓ
- మారనున్న రూపురేఖలు


స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రామ్మూర్తి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ఏనే శివారులో పారిశ్రామిక పార్కు కోసం సోమవారం ఆర్డీఓ రామ్మూర్తి ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక పార్కు అభివృద్ధి కోసం సర్వే నెంబర్ 387లో 83ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలిచామన్నారు. భూమిని సేకరించి ప్రభుత్వానికి నివేదికను అందజేశామని చెప్పారు. త్వరలోనే పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారులు ఈ స్థలాన్ని పరిశీలించేందుకు రానున్నట్లు తెలిపారు. పేదలకు అసైన్డ్ చేయని భూములను మాత్రమే సేకరించామని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ అనంతరెడ్డి, ఆర్ఐ యాదగిరి, సర్వేయర్ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

పెరగనున్న ఉపాధి అవకాశాలు

పారిశ్రామిక పార్కు నిర్మాణం జరిగితే మండలం రూపురేఖలు మారనున్నాయి. మండల కేంద్రంలో సర్వే నెంబర్ 387లో సుమారుగా 600పైచిలుకు ప్రభుత్వ భూమి ఉంది. అందులో దాదాపుగా 323ఎకరాల వరకు విడతల వారీగా పేదలకు పట్టాలు ఇచ్చి హద్దులను చూపించారు. మిగిలిన భూమి దాదాపుగా కబ్జాలకు గురవుతోంది. పారిశ్రామిక పార్కు రావడంతో హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.

క్లుప్తంగా

మంత్రి సీతక్కకు ఘన స్వాగతం


సీతక్కను సన్మానిస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క కరీంనగర్ పర్యటనకు వెళ్తున్న క్రమంలో సోమవారం మండల పరిధిలోని చర్లఅంకిరెడ్డిపల్లి వద్ద యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్జు యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. గ్రామం వద్ద మంత్రి సీతక్కను శాలువాతో సత్కరించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందే విధంగా చూడాలని ఆమెకు సూచించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అనిల్, శ్రీనివాస్, రమేశ్‌రాజు తదితరులు ఉన్నారు.

తాగునీటికి అంతరాయం రావొద్దు


మాట్లాడుతున్న శ్రీనివాసచారి

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రజలకు అందించే మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఈ శ్రీనివాసచారి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన తాగునీటి సహాయకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పైపులైన్ లీకేజీలు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చేతి పంపుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజలు తాగునీటిని వృథా చేయకుండా వినియోగించుకునేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఈ సుమలత, ఏఈ సాయికిరణ్, ఎంపీడీఓ జనార్దన్, ఎంపీఓ సోమిరెడ్డి తదితరులు ఉన్నారు.

హెచ్ఐవీకి నివారణే మార్గం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శోభాదేవి

హుస్నాబాద్: హెచ్ఐవీకి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శోభాదేవి అన్నారు. కళాశాలలో హెచ్ఐవీపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ర్యాలీలు, సమావేశాల ద్వారా ప్రజలకు హెచ్ఐవీ గురించి అవగాహన కల్పించాలన్నారు. ఐసీటీసీ కౌన్సిలర్ తిరుపతి మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాప్తి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి కర్ణాకర్, అధ్యాపకులు రవీందర్, లక్ష్మయ్య, సదానందం, నిర్మలాదేవి, సంపత్, కవిత తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ధర్నా


ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

దుబ్బాక: స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ధర్నా చేపట్టారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు నిరసనగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదుల ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలన్నారు. 41-ఎ సీఆర్‌పీసీని రద్దుచేయాలని, కోర్టులలో టెన్యూర్ పోస్టులను అంతకు ముందులాగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబూరావు, ఏజీపీ నాగరాజు, శ్రీరాం రామకృష్ణప్రభు, భాస్కర్‌రెడ్డి, అశోక్, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, చంద్రయ్య, సంతోష్ ఉన్నారు.

హరీశ్‌రావుకు ఆహ్వానం

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గలో గల విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో దేవీశరన్నవరాత్రోత్సవాల నిర్వహణ ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే హరీశ్‌రావుకు క్షేత్ర నిర్వాహకుడు హరినాథశర్మ సోమవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అక్టోబరు 3నుంచి 13వరకు నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని హరీశ్‌రావు నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ దౌర్జన్యాలకు భయపడేదిలేదు

మాజీ మంత్రి హరీశ్‌రావు


వంశీకృష్ణను పరామర్శిస్తున్న హరీశ్‌రావు

దుబ్బాక: హైడ్రా పేరుతో అల్లకల్లోలం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మీద యుద్ధం చేస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దుబ్బాకలో ఇటీవల జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జరిగిన ప్రొటోకాల్ వివాదంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణాగౌడ్‌పై పోలీసులు జులుం ప్రదర్శించడంతో గాయపడ్డ ఆయనను సోమవారం హరీశ్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసులు, కాంగ్రెస్ పార్టీ దౌర్జన్యాలకు భయపడి వెనకడుగు వేసేదిలేదని చెప్పారు. అనవసరమైన కారణాలతో బీఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బందులు పెడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కమలాకర్‌రెడ్డి, రాజనర్స్ తదితరులు ఉన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

అఖిలపక్ష నాయకుల వినతి


వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నేతలు

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్షం నాయకులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం వారు తహసీల్దార్ లక్ష్మారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల కేంద్రంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను వెంటనే రికవరీ చేయాలన్నారు. పదేళ్లుగా అక్రమార్కులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారని, కలెక్టర్, తహసీల్దార్‌లకు ఎన్నిమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితంలేదని వాపోయారు. కబ్జాదారులకు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారని ఆరోపించారు. పది రోజుల్లో ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రమేశ్‌గౌడ్, బాబు, ఎల్లయ్య, దేవరాజు, కరుణాకర్, శ్రీనివాస్, రాజిరెడ్డి, భూమయ్య, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతతో సీజనల్ వ్యాధులు దూరం

జడ్జి శివరంజని


ప్రతిజ్ఞ చేస్తున్న జడ్జి శివరంజని తదితరులు

హుస్నాబాద్: సీజనల్ వ్యాధులను అరికట్టాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సివిల్ కోర్టు జడ్జి శివరంజని సూచించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం కోర్టు ఆవరణలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆమె మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌తో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కోర్టు ఆవరణలో ఉన్న చెత్తను తొలగించారు. స్వచ్ఛతా హీ సేవలో ప్రజలందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు జడ్జి కృష్ణతేజ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, కార్యదర్శి జామీలాల్, ఏజీపీ సదానందం, న్యాయవాదులు శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్, శివశంకర్, రవీందర్, అరుణ్, అజయ్ తదితరులు ఉన్నారు.

అ'పూర్వ'కలయిక


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: పూర్వ విద్యార్థులంతా 34యేళ్ల తర్వాత కలుసుకున్నారు. వారు చదువుకున్నప్పటి రోజులను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు. మండలం పరిధిలోని అహ్మదీపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90 పదో తరగతి విద్యార్థులు వర్గల్ మండలం గౌరారంలో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేశం, దివాకర్, బగార్‌రెడ్డి, వెంకట్‌గౌడ్, వీరప్రతాప్‌గౌడ్, రాజిరెడ్డి, పూర్వ విద్యార్థులు బాల్‌చంద్రం, వెంకటయ్య, కిష్టయ్య, మల్లయ్య, నర్సింహాచారి పాల్గొన్నారు.

కుక్కదాడిలో మహిళకు గాయాలు

మిరుదొడ్డి(దుబ్బాక): కుక్క దాడిచేయడంతో ఓ మహిళ గాయపడిన ఘటన మండల పరిధిలోని మల్లుపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోరె ఎల్లవ్వ తన ఇంటి పనులు చేసుకుంటున్న క్రమంలో ఓ కుక్క ఒక్కసారిగా దాడి చేసింది. గాయాల పాలైన ఆమెను కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో ఐదు రోజుల క్రితం తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎనిమిది మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా రూ.15,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్‌కు అంతరాయం

మద్దూరు(హుస్నాబాద్)/కొమురవెల్లి(సిద్దిపేట): ఉమ్మడి మండలాల్లో మంగళవారం ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌పీహెచ్ సరఫరా మాత్రమే ఉంటుందని, త్రీఫేస్ ఉండదని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు. కొమురవెల్లి మండల పరిధిలో ఉదయం ఆరు నుంచి సాయంత్రం 6వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ మధు సోమవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం ఉంటుందని, సింగిల్ ఫేజ్ విద్యుత్‌ను సరఫరా చేస్తామని తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

దుబ్బాకరూరల్: మద్యం మత్తులో గడ్డిమందు తాగి మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని అప్పనపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ గంగరాజ్ కథనం ప్రకారం.. గ్యార మంగవ్వ(66)కు మద్యం సేవించే అలవాటు ఉంది. ఈ క్రమంలో గత 22న మద్యం సేవించడంతో భర్త మైసయ్యతో గొడవ జరిగింది. తర్వాత భర్త బయటకు వెళ్లాక ఆమె గడ్డి మందుతాగింది. అది గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. భర్త మైసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని చాట్లపల్లి సమీపంలోని ఫాంహౌజ్‌లో పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, ఎస్ఐ చంద్రమోహన్ పేకాట శిబిరంపై సోమవారం దాడిచేశారు. పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి రూ.14వేలు, తొమ్మిది మొబైల్స్ ఫోన్లను సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రజల కోసం పోరాడేది సీపీఎం ఒక్కటే..

జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి


మద్దూరు(హుస్నాబాద్): మాట్లాడుతున్న మల్లారెడ్డి

మద్దూరు(హుస్నాబాద్)/కొమురవెల్లి(సిద్దిపేట): ప్రజాసమస్యల కోసం నిత్యం పోరాడేది సీపీఎం ఒక్కటేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి అన్నారు. మండలంలోని బెక్కల్ గ్రామశాఖ ఆరో మహాసభ సందర్భంగా గ్రామంలో సోమవారం ర్యాలీ నిర్వహించి ఎర్రజెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఒకప్పుడు దున్నేవారికే భూమి కావాలని, వెట్టిచాకిరి నశించాలని పోరాడామన్నారు. ఇప్పుడు ఆక్రమణలో ఉన్న భూములను కాపాడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో శశిధర్, యాదగిరి, రవికుమార్, పోతిరెడ్డి రాజు, రంజిత్‌రెడ్డి, కనకయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. చేర్యాల మండలంలోని తపాస్‌పల్లిలో కంకణాల నర్సింహులు అధ్యక్షతన మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి మాజీ మంత్రి హరీశ్‌రావు కాలువ తవ్వించి సిద్దిపేటకు నీటిని తీసుకెళ్లారని, ప్రస్తుతం ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆయన ప్రాంతానికి నీటిని తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేర్యాల ప్రాంతంలోని చెరువులు, కుంటలు నిండిన తర్వాతనే నీటిని తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవీందర్, కనకయ్య, స్వామి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్డెమ్మ వేడుకలు


బొడ్డెమ్మతో ప్రిన్సిపాల్ భవాని, విద్యార్థులు

దుబ్బాకటౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం బొడ్డెమ్మ వేడుకలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. విద్యార్థులు బొడ్డెమ్మను అలంకరించి ఆడి పాడారు. ప్రిన్సిపాల్ భవాని మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో బొడ్డెమ్మ ఒక అపురూపమైన పండుగ అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో రుణాలు అందిస్తాం

పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న చైర్మన్ కృష్ణాగౌడ్

చేర్యాల(సిద్దిపేట): స్థానిక పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో సోమవారం చైర్మన్ కృష్ణాగౌడ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలు అందించి చేయూతనిస్తామన్నారు. గతంలో పీఏసీఎస్‌లో అప్పు తీసుకున్న రైతులు అనేక ఇబ్బందులు పడే వారని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదని చెప్పారు. సొసైటీ ద్వారా రైతులకు అందాల్సిన సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అలాగే సకాలంలో దీర్ఘకాల, స్వల్పకాలిక రుణాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. స్థానిక డీసీసీ బ్యాంకులో 740 మంది రైతుల రుణాలు మాఫీ అయ్యాయని తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్, డైరెక్టర్లు రవి, నర్సింహులు, జ్యోతి, కమలాకర్, మాధవరెడ్డి, నర్సింహులు, బాల్‌నర్సయ్య, వసంత, బాల్‌రెడ్డి, నర్సయ్య, బ్యాంకు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

మున్సిపల్ చైర్మన్ రాజమౌళి


మాట్లాడుతున్న రాజమౌళి

గజ్వేల్: పారిశుద్ధ్య సమస్యలపై మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య సమస్య వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా మూడు అజెండా అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం మున్సిపల్ డీఈగా పదోన్నతి పొందిన శ్రీధర్‌రెడ్డిని సన్మానించారు. సమావేశంలో కమిషనర్ గోల్కొండ నర్సయ్య, వైస్‌చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కొండా సురేఖ జోలికొస్తే ఊరుకోం

పీసీసీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు

సిద్దిపేటజోన్/దుబ్బాక: రాష్ట్ర మంత్రి, పద్మశాలి ముద్దుబిడ్డ కొండా సురేఖపై సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారం మానుకోవాలని. ఆమె జోలికి వస్తే ఊరుకునేది లేదని పీసీసీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్, జిల్లా యువజన విభాగం ప్రతినిధి నాగరాజు హెచ్చరించారు. సోమవారం వారు వేర్వేరుగా మాట్లాడారు. చేనేత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు నూలుతో తయారు చేసిన దండ వేసి వినతిపత్రం ఇస్తే దానిని బీఆర్ఎస్ సోషల్ మీడియా వక్రీకరించి అసత్య ప్రచారాలు, తప్పుడు పోస్టింగ్‌లు పెట్టి అవమానించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. కొండా సురేఖకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ చేనేత విభాగం ప్రతినిధులు పవన్, సంతోష్, రవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు. దుబ్బాకలో పద్మశాలి చేనేత కార్మికుల ఆధ్వర్యంలో మంత్రి సురేఖపై బీఆర్ఎస్ సోషల్ మిడియాలో అనుచిత వ్యాఖ్యలు చేయించడాన్ని నిరసిస్తూ మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌ల పోస్టర్‌ను దహనం చేశారు. ఆందోళన కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్ మాట్లాడుతూ మంత్రిపై తప్పుడు విమర్శలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సమాజం అధ్యక్షుడు గాలయ్య, గోపి, సరోజన, లక్ష్మి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మర్యాదపూర్వక కలయిక**

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌ను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని దళితుల సంక్షేమ కోసం నిధులు మంజూరు చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్టు హరికృష్ణ తెలిపారు.

◆ **సమన్వయంతో పనిచేద్దాం**

సిద్దిపేటజోన్: బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల సూచించారు. సోమవారం కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏర్పాట్లలో రాజీ పడొద్దన్నారు. అజెండాలోని ఏడు అంశాలను సభ్యులు ఆమోదించారు. కేవలం అర్ధగంటలో సమావేశాన్ని తూతూమంత్రంగా ముగించారు. సమావేశంలో వైస్ చైర్మన్ కనకరాజు, కమిషనర్ ఆశ్రిత్, సభ్యులు సుందర్, విఠోభ, లక్ష్మణ్, యోగి, కవిత, దీప్తి, వినోద్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

◆ **ఒక ఇల్లు కూలితే వెయ్యి మందికి లాభం**

సిద్దిపేటకమాన్: హైడ్రా ద్వారా ఒక్క ఇల్లు కూలితే వెయ్యి మందికి లాభం చేకూరుతుందని కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అక్రమ కట్టడాల్లో ఇళ్లు కోల్పోయిన వారి కోసం ఎమ్మెల్యే హరీశ్‌రావు బాధపడుతున్నారని, మల్లన్న సాగర్ భూనిర్వాసితులు బాధపడినప్పుడు కన్నీళ్లు రాలేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో అమరేశ్వర్‌రెడ్డి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

◆ **సర్టిఫికెట్‌ల పరిశీలన**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని డీఎస్సీ-2024 లో ఎంపికయిన అభ్యర్థులు మంగళవారం నుంచి 4వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికయిన అభ్యర్థులకు మెసేజ్‌లు పంపించామని, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్‌లను వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు.

◆ **సమాజసేవలో భాగస్వాములు కండి**

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుతోపాటు సమాజసేవలోను భాగస్వాములు కావాలని ఎన్‌సీసీ ఏఎన్ఓ వెంకటేశ్ పిలుపునిచ్చారు. ప్రజ్ఞాపూర్‌లోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్‌లో సోమవారం ఎన్‌సీసీ విద్యార్థులు చెత్తాచెదారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవడుతుందన్నారు.

◆ **హ్యాండ్ బాల్ క్రీడాకారుల ఎంపిక**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్ బాల్ టీమ్‌నకు, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారని హెచ్‌ఎం మనోహర్, పీడీ సుజాత తెలిపారు. సోమవారం హుస్నాబాద్‌లోని మినీ స్టేడియంలో నిర్వహించిన ఎంపికలో జోషిత, అర్చిత, వైష్ణవి ఎంపికయ్యారని, వారు 3నుంచి 5వరకు నారాయణపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని చెప్పారు.

◆ **చదువుల్లో రాణించాలి: సీఐ సైదా**

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీఐ సైదా సూచించారు. ప్రజ్ఞాపూర్‌లోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మహిళలకు ఉన్న రక్షణ చట్టాలు, షీటీమ్ విధులు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, ఫోక్సో, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం అనురాధ, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

◆ **చట్టం ముందు అందరూ సమానమే**

దౌల్తాబాద్(దుబ్బాక)/నంగునూరు(సిద్దిపేట): మండల పరిధిలోని శేరిపల్లి బందారంలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. మండల గిర్దావార్ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా కులం పేరుతో దూషించినా, తిట్టినా, గుళ్లోకి రానివ్వక పోయినా తమకు ఫిర్యాదు చెయ్యాలన్నారు. ఏఎస్ఐ సాయిలు, నవీన్, పరశురాములు పాల్గొన్నారు. నంగునూరు జేపీ తండాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్ఐ లింగం, హెడ్ కానిస్టేబుల్ సంపత్ పాల్గొని జోగిని వ్యవస్థ, కుల వివక్షపై ప్రజలకు అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ భిక్షపతినాయక్, రమేశ్, హెచ్‌ఎం చంద్రం పాల్గొన్నారు.

◆ **పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి**

జగదేవ్‌పూర్(గజ్వేల్): పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా స్థానిక ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. దీనిపై మండలాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నాయక్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.